www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 27 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

అక్రమ సంబంధం నేపథ్యంలో జంట ఆత్మహత్య

ఆత్మహత్యపై పలు అనుమానాలు



ప్రజాపక్షం/ ఇల్లందు : ఎదురెదురుగా ఇళ్లల్లో ఉన్న ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం అక్రమ సంబంధంగా మారింది. ఈ అక్రమ సంబంధానికి కుటుంబ సభ్యులు అడ్డుపడటంతో లేచిపోయిన జంట చివరకు శవాలుగా మారిన ఘటన ఇల్లందు పట్టణంలోని గోవింద్ సెంటర్ (దాసరి గడ్డ)లో సోమవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. కొవ్వాకుల కళ్యాణి (30) వివాహిత ఆమెకు ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. వారి ఇంటికి ఎదురుగా ఉండే తెలకపల్లి శ్రీనివాస్ (22)తో శారీరక సంబంధం ఏర్పరచుకుంది. కొద్ది రోజుల క్రితం శ్రీనివాస్, కళ్యాణి ఊరు విడిచి వెళ్లారు. సోమవారం సాయంత్రం శ్రీనివాస్ ఇంట్లో ఇద్దరు ఉరేసుకుని ఉండటాన్ని స్థానికులు గమనించారు. రెండు రోజుల క్రితమే వీరు చనిపోయినట్లు భావిస్తున్నారు. ఇల్లందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రవాణా శాఖలో ఏక్‌నిరంజన్





-వసూళ్లు, పంపకాలు అన్ని ఆయనేనట
-వార్తలు రాస్తే పరిణామాలు
తీవ్రంగా ఉంటాయట
-సారు హెచ్చరిక

ప్రజాపక్షం/ ఖమ్మం (బైపాస్ రోడ్డు) : ఖమ్మం రవాణా శాఖలో ఏక్ నిరంజన్ హవా నడుస్తుంది. ప్రభుత్వ నియమ నిబంధనలు గాలికి వదిలి తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వసూళ్లు చేయడం తన అవినీతికి మద్దతునిచ్చిన వారికి పంపిణీ చేయడం మొత్తం ఇప్పుడు సారే చూస్తున్నారట. రవాణా శాఖాధికారి కార్యాలయంలో ప్రస్తుతం అన్ని పనులు ఆయనే చక్కబెడుతున్నారట. కార్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు సైతం ఆయననే కలవాలని హుకుం జారీ చేస్తున్నారట. తెలిసి జరుగుతుందో తెలియక జరుగుతుందో కానీ జిల్లా రవాణా శాఖాధికారిని ఎవరైనా కలిస్తే వెంటనే ఆ ఎంవిఐని కలవండి అని సూచిస్తున్నారట. జిల్లా వ్యాప్తంగా వసూళ్లు చేయడం ఈ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కొందరికీ నెలవారి చెల్లింపులు చేయడం ఈ సారు ద్వారానే జరుగుతుంది. స్వయంగా ఈ అధికారే నేను దసరా మాముళ్లు పంచే పనిలో ఉన్నాను. చాలా మందికి పంచాల్సి ఉంది. ఇప్పుడు ఖాళీ లేదంటూ దసరా

మిగతా 2లో..

ఆగని ఇసుక అక్రమ రవాణా..!



-పరోక్షంగా సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు
-పొంతన లేని తహసీల్దార్ సమాధానం

ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. రెవెన్యూ అధికారుల సహకారంతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగుతుంది. కానీ ఆన్‌లైన్ ద్వారా ప్రస్తుతం బోనకల్ మండలంలో మోటమర్రితో పాటు బ్రాహ్మణపల్లి నుంచి కూడా ఇసుక ఎగుమతులు జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న తర్వాత తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అది కూడా నిర్దిష్టమైన సమయంలో మాత్రమే ఇసుక తరలించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో బ్రాహ్మణపల్లి రేవు నుంచి ఐదు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండగా బోనకల్ ఎస్ఐ మాచినేని రవి తనకున్న సమాచారంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వివరాలను రెవెన్యూ శాఖకు అందజేశారు. తహసీల్దార్ మాత్రం నిబంధనలను పట్టించుకోకుండా పైరవీకి తలొగ్గి ట్రాక్టర్లను విడుదల చేయాలని ఎస్ఐకు సూచించారు.

పొంతన లేని తహసీల్దార్ సమాధానం :
ఇసుక తరలింపుకు సంబంధించి పోలీసులు తీసుకువచ్చిన ట్రాక్టర్లను వెంటనే విడుదల చేయాలని వారి వద్ద అన్ని అనుమతులు

మిగతా 2లో..

బంగారం రుణాలపై బ్యాంకుల్లో నో రెన్యువల్



- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు
- అప్పుచేసి విడిపిస్తూ .. మళ్లీ తాకట్టుపెట్టి అప్పు కడుతూ
- పాత విధానాన్నే కొనసాగించాలంటూ డిమాండ్
- ఖాతాదారులు సహకరించాలి : బ్యాంకు మేనేజర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న ఖాతాదారులకు రెన్యూవల్ విధానాన్ని నిలిపేయడంతో ఇబ్బందికరంగా మారింది. దీనిపై పులువురు ఆవేదన వ్యక్తం చేస్తూ పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఏడాది గడువు ముగిసిన రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉండేది. రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిబంధనల ప్రకారం ప్రస్తుతం వెసులుబాటు లేకపోవడంతో అప్పుతీర్చేందుకు మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబ్బులు లేకనే మెడకు ఉండే పుస్తెల తాడు,నల్లపూసల గొలుసులు గాజులు హారాలు ఉంగరాలు కడియాలు తదితర బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో తాకట్టు పెడుతుంటారు. చిరువ్యాపారులు, వ్యవసాయదారులకు అత్యవసర సమయాల్లో బంగారు రుణాలు ఆర్థిక అండగా నిలుస్తుంటాయి. అయితే ఏడాదిలోగా విడిపించుకోకపోతే బ్యాంకర్లు డబ్బులు చెల్లించి బంగారాన్ని విడిపించుకోవాలంటూ లేదంటే నిబంధనలు ఒప్పుకోవని అంటున్నారు. దీంతో చేసేది లేక వేరే దగ్గర అధిక వడ్డీకి డబ్బులు తెచ్చి బ్యాంకుల్లో చెల్లించి

మిగతా 2లో..

నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి



-తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి
-అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు
-ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మంత్రి తుమ్మల
-నల్లకుంట చెరువు సందర్శన

చరిత్రకు కొత్త వెలుగులు..
బౌద్ధ వారసత్వ సంపద పరిరక్షణకు చర్యలు

-ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ..
పది రోజుల్లో పెండింగ్ బిల్లులు జమ
-మంత్రి పొంగులేటి



రవాణా శాఖలో ఏక్‌నిరంజన్

(మొదటిపేజీ తరువాయి)

పండుగకు ముందు కార్యాలయంలో హల్‌చల్ చేయడం అక్కడకు వచ్చిన ప్రజలు కూడా గమనించి విస్తుపోయారు. మొత్తానికి జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో అన్ని తానై చక్కబెడుతున్న ఈ అధికారి ఇప్పుడు ఏకంగా బెదిరింపులకు సైతం దిగుతుండటం ఆశ్చర్యపరుస్తుంది. రహదారులపై వాహన తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. నెలవారీ మామూళ్లు ఇస్తున్న వారు ఈ అధికారిని భరించలేక లోలోన కుమిలిపోతున్నారు. 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురించిన 'పైకే పారదర్శకత లోపల వసూళ్ల పర్వం' అన్న కథనం ప్రచురించడంతో పలువురు స్వయంగా ఫోన్ చేసి ఈ దోపిడీ భరించలేకపోతున్నామంటూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నెలవారీ మామూళ్లలో ఒక్క నెల చెల్లించలేకపోయినా వేటాడి వెంటాడి జరిమానాలు విధిస్తూ వేధిస్తున్నారని ఒక పక్క వ్యాపారాలు లేక నష్టాల్లో ఉంటే ఇప్పుడు ఈ అధికారి తీరుతో మరింత ఇబ్బందులు పడుతున్నామన్నారు. మొత్తం వసూళ్లకు కేంద్రంగా వ్యవహరించే అధికారి తాను కాకపోతే మిగిలిన అధికారులకు మామూళ్లు చెల్లించని వారి వివరాలు చెప్పి వాహనాలను పట్టుకుని యాజమానులను సీజ్ పేరుతో ఇబ్బందులు పెట్టి చివరకు నగదు చెల్లింపు తర్వాత రాజీ పడుతున్నారని పలువురు వాహనదారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఎప్పుడు లేని విధంగా ఆర్టివో కార్యాలయంలో సందర్శకుల వివరాలను హోంగార్డు ద్వారా నమోదు చేయిస్తున్న విధానం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. పేర్లు, ఫోన్ నెంబర్లు, వాహన వివరాలు సేకరించడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక కూడా ఏదో మర్మం దాగి ఉందన్న ప్రచారం జరుగుతుంది. ఆర్టివో కార్యాలయంలో జరుగుతున్న మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉంది. ప్రభుత్వం ఆర్టివో కార్యాలయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల వ్యవహారం లేకపోయినా భారీ స్థాయిలో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

'ప్రజాపక్షం'కు బెదిరింపులు...

సోమవారం ఆర్టివో కార్యాలయంకు సంబంధించి ప్రజాపక్షంలో వార్త ప్రచురించగానే కొందరు ఏజెంట్లకు చెప్పి ప్రజాపక్షం విలేకరిని బెదిరించే ప్రయత్నం చేశారు. మాపై వార్తలు రాస్తే భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసా అయనకు ఒకసారి చెప్పండి అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చాలా ఇబ్బందులు ఎదురవుతాయి అంటూ ఏజెంట్ల ద్వారా హెచ్చరికలు చేస్తూ ఇప్పటికైనా వార్తలు రాయడం మానుకోండి అంటూ సూచిస్తున్నారట.

ఆగని ఇసుక అక్రమ రవాణా..!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయంటూ బోనకల్ తహసీల్దార్ సుధాకర్ పోలీస్ అధికారులకు తెలియజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని దాని ప్రకారమే ఇసుక తరలిస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. కానీ ఇసుక కావాల్సిన వినియోగదారుడు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న తర్వాత ఆ వివరాలు మండల రెవెన్యూ కార్యాలయానికి వస్తాయి. దానిని పరిశీలించి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇసుక తరలింపుకు సంబంధించి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది ప్రభుత్వ నిబంధన. దీనితో పాటే వినియోగదారుడు నిర్ణీత కాల వ్యవధిలో ఇసుకను తరలించాల్సి ఉంటుంది. కానీ తహసీల్దార్ చెబుతున్నది తద్ విరుద్ధంగా ఉంది. వారే బుక్ చేసుకుని వారే ఇసుకను తరలించుకుంటున్నారని అందుకు సంబంధించిన ఆధారాన్ని తనకు చూపించారంటూ ఆయన సమాధానం ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో అనుమతులు పొందిన వారు సమయపాలన పాటించాలి కదా దానితో పాటు మీరు అనుమతులు ఇచ్చారా అని ప్రశ్నించగా తనకు ఆ విషయం తెలియదంటూ చెప్పుకొచ్చారు. వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తానన్నారు. మరి వివరాలు ఏమి తెలియకుండానే ట్రాక్టర్లను రిలీజ్ చేయమని ఎలా ఆదేశాలు జారీ చేశారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేదు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నప్పుడు ఎన్ని క్యూబిక్ మీటర్ల కొరకు దరఖాస్తు చేసుకున్నారనే వివరాలు ఉంటాయి. దాని ప్రకారమే తరలించాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇష్టానుసారంగా ఇసుకను తరలించుకుపోతుంటే తహసీల్దార్ ఆన్‌లైన్ బుకింగ్ అంటూ ఇసుక అక్రమ రవాణాదారులకు వత్తాసు పలకడం పలు అనుమానాలకు తావిస్తుంది. అసలు అధికారులు లేకుండా ఇసుకను తరలించడం జరుగుతుంటే చర్యలు తీసుకోవాల్సిన తహసీల్దార్ వదిలేయడం ఇప్పుడు మండలంలో చర్చనీయాంశమైంది. ఐదు ట్రాక్టర్లను వదిలి వేయాలని ఆయన హుకుం జారీ చేశారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేటప్పుడు ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక అన్నది బుక్ చేయాల్సి ఉంటుంది. మరి అలా చేశారా అన్న దానిపై వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే ఆయన సమాధానం చెప్పడం లేదు. పైగా వారు ఏదో గండ్ర ఇసుక తొలుకుంటున్నారులే అని వ్యాఖ్యానించడం కొసమెరుపు.

నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి





ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సోమవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పర్యటించారు. మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. నల్లకుంట చెరువు నీటితో నిండిన సందర్భంగా చెరువును సందర్శించి పూలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో రఘునాథపాలెం ప్రాంతం అర్బన్ మండలంలో భాగంగా ఉండేదని ఆ సమయంలో ఈ ప్రాంతానికి పంచాయతీరాజ్ నిధులు అందుబాటులో ఉండేవి కావన్నారు. ఈ ప్రాంతాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రఘునాథపాలెం మండలాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కృష్ణా, గోదావరి నదులకు దూరంగా ఉన్న రఘునాథపాలెం మండలంలో గిరిజన జనాభా అధికంగా నివసిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు వి. వెంకటాయపాలెం డిప్ కట్ నుంచి మంచుకొండ లిఫ్ట్ ద్వారా 25 చెరువులకు నీటిని అందించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుగ్గవాగు నుంచి మరో 11 చెరువులకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయని తద్వారా రైతులు కూరగాయలు, తక్కువ నీటితో పండే పంటలు సాగు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రఘునాథపాలెం మండలంలోని మొత్తం 36 గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి తాగునీటి సరఫరా పథకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూపర్ ఎల్‌నినో కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మండల ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పుట్టకోట నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. మండలంలో మొదటి విడతలో 1300 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రెండవ విడతలో మరో 1100 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామన్నారు. రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేందుకు రహదారుల నిర్మాణం కోసం ఇప్పటికే రూ. 75 కోట్లు మంజూరు చేశామని త్వరలో మరో రూ. 25 కోట్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. వి బి జి రాంజీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగి సీజన్‌లో వరి సాగుకు నీటి లభ్యత ఉండకపోవచ్చునని రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వరికి బదులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్‌బాబా, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచ్ తేజావత్ బద్రి, ఉప సర్పంచ్ బండి వెంకన్న, రాయల నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, కేలోత్ దేవ్ సింగ్, వాంకుదోత్ దీప్లా, ఏఎంసి డైరెక్టర్ తమ్మిని నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, ఇరిగేషన్ డిఈ మోతీలాల్, అధికారులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

బంగారం రుణాలపై బ్యాంకుల్లో నో రెన్యువల్

(మొదటిపేజీ తరువాయి)


విడిపించిన బంగారాన్ని మళ్లీ తాకట్టుపెట్టి వచ్చిన మొత్తంతో తెచ్చిన అప్పును తీర్చాల్సి వస్తోందని ఖాతాదారులు వాపోతున్నారు. తద్వారా ఆర్థిక భారం పడుతుందని, వడ్డీ, ఇతర ఛార్జీలు పడటంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. రుణాల చెల్లింపులో ఆర్థిక క్రమశిక్షణ అవసరమే అయినప్పటికీ సకాలంలో వడ్డీ చెల్లించే ఖాతాదారులకు నిబంధనల ప్రకారం రెన్యూవల్ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. పాత విధానాన్ని కొనసాగించడం ద్వారా ఆర్థిక ఇబ్బందులు కొంత వరకు తగ్గుతాయనే అభిప్రాయాన్నివ్యక్తం చేస్తున్నారు. రుణాలపై కొత్త నిబంధనలు అమలు చేస్తున్న బ్యాంకులు ఆర్థిక సంస్థలు ఖాతాదారుల పరిస్థితులను కూడా పరిగణలోనికి తీసుకుని తగిన వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్‌బిఐ గైడ్‌లెన్స్ ప్రకారమే.. : కెనరా బ్యాంకు మేనేజర్



ఏడాది కాలపరిమితి పూర్తయిన బంగారు రుణాలపై ఆర్‌బిఐ కొత్త విధానాలు ఏడాదిగా అమలవుతున్నాయి. రెన్యూవల్ విధానాన్ని రద్దు చేశారు. గడువు పూర్తయిన బంగారు రుణాల వ్యవహారంలో పూర్తిగా చెల్లింపులు చేసి లోన్ ముగింపు చేయాలి. ఆ తర్వాతే మళ్లీ కొత్తరుణం మంజూరు అవుతుంది. సకాలంలో రుణాలు చెల్లించి ఖాతాదారులు అంతా సహకరించాలి. దీనిపై భద్రాచలం కెనరా బ్యాంకు మేనేజర్ ప్రజాపక్షం కు మారిన నిబంధనలపై వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా మేనేజర్ తన పేరును చెప్పేందుకు ఇష్టపడలేదు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎంఎల్ఏ, శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోమవారం తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత పెరిగి, అర్హులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతాయని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉదయ్ కిరణ్, కాంగ్రెస్ జిల్లా అధికారి ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా కన్వీనర్ మహిమూద్ ఖాన్, పార్టీ మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

దళారులు పాలవుతున్న ధాన్యం

కొర్రీలు లేకుండా కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఖరీఫ్ పంట చేతికి వస్తుండడంతో పలు గ్రామాలలో ప్రైవేటు వ్యాపారులు కల్లాలలోకే వెళ్లి పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి, వాచా నాయక్ తండ , బోడి మల్లె, చండ్రు పట్ల, ముచ్చవరం, రఘునాథ్ గూడెం, పాయపూరు, లింగాల, యజ్ఞ నారాయణపురం, తదితర గ్రామాలలో దళారులు రైతుల వద్దకు వెళ్లి ధర మాట్లాడుకొని కొనుగోలు చేసుకుంటున్నారు. 77 కేజీల బస్తా 2600 కు రైతులు అమ్మే సుకుంటున్నారు. దానిలో తాలు, మట్టి పె ల్లలు, తరుగు లేకుండానే పచ్చి వడ్లు అమ్మేసుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు ముందుగానే రైతుల సెల్ నెంబర్లు తీసుకొని ముందుగానే మాట్లాడుకొని అమ్మేసుకుంటున్నారు. మండలంలో 33 వేల ఎకరాలలో ఖరీఫ్ వరి పంటను 40,000 మంది రైతులు ఈ సీజనకు పంటను సాగు చేశారు. ఒక్కో ఎకరాకు 36 బస్తాల నుండి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. కొన్ని ప్రాంతాలలో 30 లోపు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం దిగుబడి తగ్గి ధర ఎక్కువగా పలకటంతో వ్యాపారులు నేరుగా గ్రామాల్లోనే తిష్ట వేసి కొనుగోలు చేస్తున్నారు. నేరుగా కల్లాలలోకే ప్రైవేటు వ్యాపారులు ప్రవేశం కావడంతో వారికే అమ్మేసుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కూడా అవి వెల వెల పోతున్నవి. తుఫాను ప్రభావంతో ధాన్యం ఆగమవుతుందని ఆలోచనతో ధాన్యం రైతులు అక్కడే తెగేసి అమ్ముకుంటున్నారు. తుఫాను ప్రభావంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం కావడంతో కోసిన పంట అప్పటికప్పుడే పచ్చిధాన్యమే కల్లాలలోని అమ్ముకుంటున్నారు.

విద్యుత్ సమస్యలపై ప్రజావాణిలో ఉప సర్పంచ్ వినతి



ప్రజాపక్షం/అశ్వాపురం: అమెర్ధ్ గ్రామ పంచాయితీ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించి, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామ ఉప సర్పంచ్ మేకల అంజిబాబు అధికారులను కోరారు. సోమవారం అశ్వాపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు సంబంధిత అధికారులకు దరఖాస్తు సమర్పించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అవసరమైన స్తంభాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఫిర్యాదును పరిశీలించాలి

-ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలానికి చెందిన డి. అపర్ణ తనకు దివ్యాంగుల పెన్షన్ వస్తుందని బతకడం చాలా కష్టంగా ఉందని ఏదైనా ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరానికి చెందిన మహ్మద్ అబ్దుల్ కరీం తాను టిహబ్ డయగ్నస్టిక్ సెంటర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు అవుట్‌సోర్సింగ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించానని జనవరి 2024లో టర్మినేట్ చేశారని తనకు ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరానికి చెందిన ఎస్‌కె నమ్రీన్ తాను ట్రాన్స్‌జెండర్ మహిళగా తనకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఎం. రోజా తన భర్త తాగుతూ హింసకు గురి చేస్తున్నాడని తనకు రక్షణ కల్పించాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 14 ఫిర్యాదులు :

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 14 ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 10, టౌన్ ప్లానింగ్ శాఖకు సంబంధించి మూడు, ఇంజనీరింగ్ శాఖకు సంబంధించి ఒక ఫిర్యాదు అందింది. ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు.

బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పట్టభద్రుల ఓట్ల నమోదు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : త్వరలో పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నాయకులు ముమ్మరంగా చేపట్టారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓట్ల నమోదును సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ సూచనలతో దేవభక్తిని కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను కలిసి 101 ఓట్లను నమోదు చేయించారు. ఎల్‌బి నగర్ ప్రాంతంలో వాంకుడోత్ సురేష్ ఆధ్వర్యంలో 54 ఓట్లు, వైఎస్ఆర్ కాలనీ, బాలపేట ప్రాంతాల్లో కందాల వీరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో 47 ఓట్లను నమోదు చేశారు. ఓట్లకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంఎల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, ఖానాపురం హవేలీ ఇంచార్జి కార్తీక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దేవభక్తిని కిషోర్‌బాబు మాట్లాడుతూ గత పట్టభద్రుల ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారి వివరాలను తెలుసుకుని మరల వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకునేలా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ ఆరు లోపు తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రహీం, విజయ్, యూసఫ్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

పట్టణ ప్రజలకు మున్సిపల్ చైర్మన్ విజ్ఞప్తి



ప్రజాపక్షం/సత్తుపల్లిః రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాల నేపథ్యంలో పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని సత్తుపల్లి మున్సిపాలిటీ చైర్మన్ మహ్మద్ రిహానా కమల్ పాషా విజ్ఞప్తి చేశారు. నీటి వృథాను అరికట్టి, భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె సూచించింది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ వాటర్ సప్లై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, పట్టణంలో నీటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, వృథాను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటి యజమాని అవసరానికి సరిపడా నీటిని మాత్రమే వినియోగించాలని, ఇళ్ల పరిసరాల్లో లేదా వీధుల్లో నీటి పైపుల లీకేజీలు గుర్తించిన వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రతి నీటి కనెక్షన్‌కు తప్పనిసరిగా వాల్వ్ ఏర్పాటు చేసుకుని, అవసరం లేని సమయంలో నీటి సరఫరాను నిలిపివేయాలని సూచించారు. నీటి సరఫరా నిబంధనలు ఉల్లంఘించే కనెక్షన్లను వాటర్ సప్లై సిబ్బంది తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారని అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే నీటి పన్ను బకాయిలు ఉన్న వినియోగదారులు వెంటనే వాటిని చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి సంరక్షణ సామాజిక బాధ్యతనీరు విలువైన సహజ వనరని, దానిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి లభ్యతను కాపాడవచ్చని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. నీటి కొరతను నివారించడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, మున్సిపాలిటీ సూచనలను పాటిస్తూ నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కరువుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా



ప్రజాపక్షం/చింతకాని ఃి తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులు రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్న నేపథ్యంలో రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నాగులవంచలో మద్దిన్ని బసవయ్య అధ్యక్షతన జరిగిన సీపీఎం చింతకాని మండల కమిటీ సమావేశంలో నున్నా మాట్లాడుతూ కరువు పరిస్థితులపై చర్చించేందుకు ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, రైతులకు ఎలాంటి సహాయం అందించబోతోందో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతన్నలు వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండలకార్యదర్శి దేశబోయిన ఉపేందర్, నాయకులు వత్సవాయి జానకిరాములు, తోటకూరి వెంకటనర్సయ్య, ఆళ్ల మాధవరావు, పులి యజ్ఞనారాయణ, కాటబత్తిన వీరబాబు, ఓబెనబోయిన అచ్చయ్య, లింగం కోటి, గడ్డం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహకవి వాల్మీకి జయంతి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మహకవి వాల్మీకి జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఎల్ఏ రాందాస్ నాయక్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జ్యోతి వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మహకవి వాల్మీకి రామాయణాన్ని రచించి ఆ గ్రంథం ద్వారా సమాజానికి అనేక విలువలను అందించారన్నారు. రామాయ ణం ద్వారా ఆదర్శ మానవునికి ఉండాల్సిన లక్షణాలు, మానవ సంబంధాలు, నైతిక విలువ గు రించి వాల్మీకి బోధించారన్నారు. ఆయన రచించిన రామాయణంలోని ఆదర్శాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. వివిధ సంఘాల నాయకులు మల్లికార్జున్, రాంచందర్‌రావు, దగ్గు శ్రీనివాస్, ఉపేందర్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



ప్రజాపక్షం/సత్తుపల్లిః మండల పరిధిలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆదికవిగా ప్రసిద్ధి చెందారని, రామాయణ మహా కావ్యాన్ని రచించి భారతీయ సాహిత్యానికి ఎనలేని కీర్తిని తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆయన జీవితం, రచనలు, ఆదర్శాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ బి. వినాయకరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ముందస్తు అరెస్టు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని ఉద్యమకారుల ఫోరం హెచ్చరించిన నేపథ్యంలో ఉద్యమకారులను పోలీసులు సోమవారం ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు నాగులమీరాను పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేపట్టారు. ఈ సందర్భంగా నాగులమీరా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇలా నిర్బంధించడం సరైంది కాదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు.

మొక్కలను నాటడమే కాదు.. సంరక్షించడం కూడా మన బాధ్యత : వరలక్ష్మి





ప్రజాపక్షం/వైరాఃి పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా వన మహోత్సవంలో భాగంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు సిఎస్ఐ చర్చి రోడ్డులో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు ప్రారంభించారు. పువ్వాళ్ల రాము ఇంటి వద్ద ఆమె స్వయంగా మొక్కలు నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు మాట్లాడుతూ మొక్కల పంపిణీ కార్యక్రమాలు సమాజంలో పర్యావరణంపైఅ వగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటం ఎంతో ముఖ్యమో అని ఆరోగ్యంగా పెరిగేలా సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని కౌన్సిలర్ వరలక్ష్మి శ్యామ్‌బాబు పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం, కాలుష్యాన్ని తగ్గించడం, భూగర్భ జలాల స్థాయిని మెరుగుపరచడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. మనం నాటే ప్రతి చిన్న మొక్క భవిష్యత్ తరాలకు విలువైన ఆస్తిగా నిలుస్తుందని, మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల రాము, బీక్యా, పండు, హుస్సేన్, వృధ్వి, నవీన్, క్ష్ణ, రవి, జవాన్ అనిల్, గ్రామదీపికలు తిరుపమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

కూలీల ట్రాక్టర్ బోల్తా..

22 మందికి గాయాలు



ప్రజాపక్షం/చింతకాని ఃి చింతకాని మండలం తిమ్మినేనిపాలెం సమీపంలో వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి 22 మంది కూలీలకు గాయాలయ్యాయి. తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పత్తి తీసేందుకు నాగులవంచ గ్రామానికి వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 22 మందికి కూలీలకు గాయాలయ్యాయి. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రెండు అంబులెన్సుల ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులను మోసం చేసి పింఛన్ నగదు స్వాహా



ప్రజాపక్షం/జూలూరుపాడుః మండల కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంక్ నందు వృద్ధాప్య పింఛన్ డబ్బులు డ్రాచేసుకుని ఇంటికి వెళ్తున్న ఇద్దరు వృద్ధులను గుర్తు తెలియని వ్యక్తి మాయమాటలతో నమ్మ బలికి నాలుగువేల ఫెన్షన్ నగదుతో ఉడాయించిన ఘటన సోమవారం జూలూరుపాడులో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన గంజి కనకమ్మ, కొల్లి జగన్నాధం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయిన వృద్ధాప్య పింఛన్ డబ్బులను తీసుకునేందుకు సోమవారం జూలూరుపాడులోని ఎస్బీఐ బ్యాంకుకు వచ్చారు. నగదు డ్రా చేసుకుని బ్యాంకు నుంచి బయటకు వస్తుండగా, హెల్మెట్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వారి వద్దకు వచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త పథకం ప్రవేశపెట్టారని, పింఛన్‌గా వచ్చిన రూ.4 వేలతో పాటు అదనంగా మరో రూ.2 వేలు కలిపి ఇస్తున్నారని వృద్ధులను నమ్మబలికించాడు. చిల్లర తీసుకొస్తానంటూ వృద్ధుల వద్ద ఉన్న రూ.4 వేల నగదును తీసుకుని ద్విచక్రవాహనంపై అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎంత సేపటికీ సదరు వ్యక్తి తిరిగి రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన వృద్ధులు గంజి కనకమ్మ, కొల్లి జగన్నాధం తీవ్ర ఆవేదనకు వ్యక్తం చేసారు.

అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ సిబ్బంది సూచన...

గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి నగదును వారి చేతుల్లో పెట్టవద్దని, ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సామాజిక మాధ్యమాల ద్వారా పలుమార్లు సూచిస్తున్నప్పటికీ ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బ్యాంకుల నుంచి నగదు తీసుకుని బయటకు వచ్చే వృద్ధులు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. కష్టపడి పొందిన పింఛన్ డబ్బులు మోసగాళ్ల చేతిలో పోవడంతో బాధిత వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



ప్రజాపక్షం/మణుగూరుః ఎల్ నినో వల్ల కలిగిన వర్షాభావ పరిస్థితుల్లో నీటిని,విద్యుత్ ను పొదుపుగా వాడాలని బిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్న ఉద్యోగులకు సూచించారు. బీటీపియస్‌లో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎల్ నినో నేపథ్యం ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సూచనలు చేస్తుందని పేర్కొన్నారు. ఆ సూచనలు అన్నిటిని పాటించాల్సిన బాధ్యత విద్యుత్ ఉద్యోగులుగా మనకు మరింత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న సూచన

కర్మాగారంలో నీటి వృధా కాకుండా ఎప్పటికప్పుడు పైపులైను తనిఖీ చేయాలని సూచించారు. అవసరమైనప్పుడు మాత్రమే లైట్లను వినియోగించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కొరత నేపథ్యంలో బీటీపీఎస్ నుంచి ఎక్కువ విద్యుత్పత్తి చేస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. బీటీపీస్ పనితీరుపై జెన్కో ఉన్నతాధికారులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఉద్యోగులందరి కృషి ఫలితంగానే మెరుగైన పనితీరు కనబరిచామని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిటిపిఎస్ సూపరైంట్ ఇంజనీర్లు మురళీకృష్ణ, డబ్ల్యు. రమేష్ బాబు, టి. శ్రీనివాసరావు, సిహెచ్.రామ్మోహన్ పలువురు అధికారులు అసోసియేషన్, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయి ఎంఎల్ఏ గారూ.. మా గోడు ఆలకించరా..?



ప్రజాపక్షం/చంద్రుగొండ: సాగునీరు అందక చేతికొచ్చిన వరి పంటలు ఎండిపోతుండటంతో చంద్రుగొండ మండలం మహ్మద్‌నగర్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంట పొలాల్లో నిలబడి సోమవారం నిరసన తెలిపారు. ఎంఎల్ఏ జారె ఆదినారాయణ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. సీతాయిగూడెంలోని వెంగళరావు ప్రాజెక్టు కుడి కాలువ కింద మహ్మద్‌నగర్ గ్రామంలో సుమారు 200 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు. ఈ ఏడాది అలుగు మరమ్మతుల పేరుతో సాగునీరు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుడి కాలువ చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోతున్నాయని వాపోయారు. ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ మరమ్మతులు పేరుతో వృథాగా వాగుల్లోకి వదులుతున్నారని, సాగునీరు అందించడంలో నీటి

-జనరేటర్లే దిక్కు..సాగునీటి కోసం మహ్మద్‌నగర్ రైతుల నిరసన
-అలుగు మరమ్మతుల పేరుతో నీరు నిలిపివేతపై ఆగ్రహం



పారుదల శాఖ అధికారుల వైఫల్యమే తమకు శాపంగా మారిందని రైతులు ఆరోపించారు. మరోవైపు ఎండలు, విద్యుత్ కోతలతో పంటలకు నీరు అందించలేకపోతున్నామని తెలిపారు. ఆర్థిక స్థోమత ఉన్న కొందరు రైతులు జనరేటర్ల సాయంతో పంటలను తడుపుకుంటున్నారని, మిగిలిన రైతులు పంటలు కళ్లముందే ఎండిపోతుంటే దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుడి కాలువకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. తమ పొలాలను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఏ జారె ఆదినారాయణకు విజ్ఞప్తి చేశారు. నిరసనలో మహ్మద్‌నగర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

దాతలు దయచూపండి..!

-ఆరు నెలల పసికందును కాపాడండి!
-మెదడులో రక్తం గడ్డగట్టి ప్రాణాపాయ స్థితిలో చిన్నారి
-వైద్య ఖర్చులు భరించలేక తల్లిదండ్రుల ఆర్థికసాయం కోసం వేడుకోలు



ప్రజాపక్షం/ములకలపల్లి: మెదడులో రక్తం గడ్డకట్టి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆరు నెలల పసికందు వైద్యానికి దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ములకల పల్లి మండలం నల్లవారిగూడెం గ్రామానికి చెందిన నల్లి రాజేశ్వరి, నల్లి సాయి దంపతులు చిన్నారికి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో



చికిత్స అందిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు వైద్య ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు దాతలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. దాతల సాయం తమ బిడ్డ చికిత్సకు ఎంతో తోడ్పడుతుందని ఆశిస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ఐ అండర్ 17 క్రికెట్‌కు సారపాక బాలికలు

-కోహ్లీ క్రికెట్ అకాడమీ విద్యార్థినులు సుహానా, ఆరాధ్య ఎంపిక



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఆర్థిక ఇబ్బందులను అధిగమించి క్రికెట్‌లో ప్రతిభ చాటిన సారపాకకు చెందిన సుహానా, ఆరాధ్య ఎస్‌జీఎఫ్ఐ అండర్ 17 క్రికెట్ విభాగానికి ఎంపికయ్యారు. కోహ్లీ క్రికెట్ అకాడమీకి చెందిన ఈ ఇద్దరు బాలికలు ఉన్నత స్థాయికి ఎంపికై ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లోనూ అపారమైన క్రీడా ప్రతిభ ఉందని వీరి విజయం నిరూపిస్తోంది. కోహ్లీ క్రికెట్ అకాడమీ కోచ్‌లు ఎస్ఆర్‌వి రమణ, కె రామ్ కిషోర్ అందిస్తున్న శిక్షణ, మార్గదర్శకత్వం బాలికల విజయానికి తోడ్పడుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చినప్పటికీ పట్టుదలతో సాధన చేసి రాష్ట్ర స్థాయి క్రీడా వేదికకు ఎంపిక కావడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుహానా, ఆరాధ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి సారపాకకు పేరు తీసుకురావాలని కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేయాలి



ప్రజాపక్షం/కూసుమంచి: ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టం తగ్గే అవకాశం ఉన్నందున యాసంగిలో వరి, మొక్కజొన్నకు బదులుగా తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని మండల ప్రత్యేక అధికారి సునీల్ రైతులకు సూచించారు. కూసుమంచి మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెసర, మినుము, వేరుశనగ, జొన్న వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మాట్లాడుతూ ఖేత్ బచావో అభియాన్ పథకం ద్వారా భూసంరక్షణ, నేల మెరుగుదల, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈ నవీన్, విద్యుత్ శాఖ సిబ్బంది, సర్పంచ్ నీలకంఠం, గ్రామ పాలన అధికారి, పంచాయితీ కార్యదర్శి, ఏఈఓ రఘు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చరిత్ర పాఠాలకు క్షేత్రస్థాయి అనుభవం

-కూసుమంచి శివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



ప్రజాపక్షం/కూసుమంచి: చారిత్రక కట్టడాల ప్రాధాన్యం, పురాతన దేవాలయాల నిర్మాణశైలి, అప్పటి సంస్కృతి, సంప్రదాయాలపై ప్రత్యక్ష అవగాహన కోసం కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర విద్యార్థులు సోమవారం స్థానిక శివాలయాన్ని సందర్శించారు. చరిత్ర ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా ఈ క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు, చరిత్ర అధ్యాపకుడు సోమలింగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఆలయాన్ని పరిశీలించి దాని చారిత్రక ప్రాధాన్యాన్ని తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాల్లో చదివిన అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా చరిత్రపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం కలిగింది. పుస్తక పఠనంతో పాటు చారిత్రక ప్రదేశాలను సందర్శించడం విద్యార్థుల్లో చరిత్రపై ఆసక్తిని పెంచుతుందని అధ్యాపకులు తెలిపారు. ఇలాంటి పర్యటనలు స్థానిక వారసత్వ సంపద ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/ఇల్లందు: ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశమైన ఆయన ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. విద్యుత్, నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి ఇంటికీ తాగునీరు అందించే విషయంలో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. కరువు పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, కొత్త జాబ్ కార్డులు పొందినవారితో పాటు ప్రస్తుతం క్రియాశీలంగా లేని కార్డుదారులకూ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు నష్టపోకుండా ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని, పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసేలా వ్యవసాయశాఖ అధికారులు సూచనలు ఇవ్వాలని ఎంఎల్ఏ కోరం కనకయ్య ఆదేశించారు.

నాగపురి భూలక్ష్మి మృతి పట్ల సంతాపం



ప్రజాపక్షం/ఇల్లందు: బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదో వార్డు ఇన్‌చార్జి, హోటల్ నిర్వాహకుడు నాగపురి కన్నయ్య తల్లి నాగపురి భూలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. భూలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. సంతాపం తెలిపిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, టీజీబీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుదర్శన్ రంగనాథ్, ఇల్లందు పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్, పట్టణ బీఆర్ఎస్ నాయకుడు బజారు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో గ్రామీణ ఖద్దరు..!

-ఆదాయం అంతంతే.. ఖర్చులు కొండం
-ఎన్నికల్లో ఆర్భాటం.. పదవుల్లో ఆర్థిక భారం
-గెలిచినా.. ఓడినా అప్పుల బాధ తప్పని పరిస్థితి
-పల్లెల్లో ప్రజాసేవకు పెరుగుతున్న వ్యక్తిగత ఖర్చులు
-ప్రతిపక్ష సర్పంచ్‌లకు నిధుల సమస్యలు





ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఎన్నికల బరిలో దిగాలంటే లక్షల ఖర్చు, గెలిస్తే ప్రజల అవసరాల కోసం మరిన్ని వ్యయాలు. ఓడిపోతే చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి..! గ్రామీణ రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ ఆశావహులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రజల్లో పలుకుబడి పెంచుకోవాలన్న తపన, ఎన్నికల్లో గెలవాలన్న పట్టుదలతో చేసే ఖర్చులు కొందరిని అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. మరోవైపు పదవి చేపట్టిన తర్వాత గ్రామ సమస్యల పరిష్కారం కోసం సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఎన్నికల ముందు హడావుడి, ఎన్నికల తర్వాత ఆర్థిక ఇబ్బందులు, వెరసి గ్రామీణ ఖద్దరుకు అప్పుల భారం తప్పడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల ఖర్చులు.. తీరని అప్పులు

గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఎన్నికలు వ్యక్తిగత ప్రతిష్ఠకు, రాజకీయ భవిష్యత్తుకు కీలకంగా మారుతున్నాయి. ప్రచారం, కార్యకర్తల నిర్వహణ, సమావేశాలు, రాకపోకలు, ఇతర ఎన్నికల అవసరాల కోసం అభ్యర్థులు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. కొందరు తమ పొదుపును వినియోగిస్తుండగా, మరికొందరు అప్పులు చేసి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. గెలిస్తే రాజకీయంగా గుర్తింపు వస్తుందన్న ఆశతో ఖర్చుకు వెనుకాడటం లేదు. అయితే, ఫలితం అనుకూలించకపోతే పెట్టిన ఖర్చుకు ప్రతిఫలం లేకపోగా అప్పులు తీర్చడం పెద్ద సమస్యగా మారుతోంది. ఎన్నికల్లో గెలిచిన వారికీ ఆర్థిక ఇబ్బందులు పూర్తిగా తొలగిపోవడం లేదు.

పదవి వచ్చింది.. ఖర్చులు పెరిగాయి

సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంపై బాధ్యత పెరుగుతుంది. తాగునీరు, పారిశుద్ధం, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలపై గ్రామస్తులు సర్పంచ్‌లను ఆశ్రయిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని కోరుతారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడం, ప్రజలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలకూ వ్యక్తిగత ఖర్చులు తప్పడం లేదు. పంచాయతీకి నిధులు అందుబాటులో లేకపోయినా ప్రజల అవసరాలకు స్పందించాల్సిన ఒత్తిడి కొందరు సర్పంచ్‌లపై ఉంటోంది. దీంతో సొంత డబ్బులు వెచ్చించి చిన్నచిన్న పనులు చేయించడం, అత్యవసర అవసరాలకు సహకరించడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. అధికారిక నిధులతో చేపట్టాల్సిన పనులకు వ్యక్తిగతంగా ఖర్చు చేయాల్సి వస్తే ఆ భారం చివరకు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై పడుతోంది.

బిల్లుల జాప్యం.. వడ్డీల భారం

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత బిల్లుల చెల్లింపులు ఆలస్యమైతే ఆర్థిక సమస్యలు మరింత తీవ్రమవుతాయి. సొంత డబ్బులు లేదా అప్పులు తెచ్చి పనులు పూర్తి చేసినవారు చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. అప్పులపై వడ్డీలు పెరుగుతుండటంతో అసలు చెల్లింపులు కూడా భారంగా మారుతున్నాయి. కొందరు తమ పొదుపును ఖర్చు చేయాల్సి వస్తుండగా, మరికొందరు ఆస్తులు విక్రయించాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ ఆర్థిక ఒత్తిడి కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య అవసరాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి కారణాలు పనుల ధ్రువీకరణ, నిధుల విడుదల, పరిపాలనా ప్రక్రియలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల బిల్లుల పరిస్థితిపై స్పష్టమైన వివరాలు అందుబాటులోకి రావడం అవసరం.

ప్రతిపక్ష సర్పంచ్‌లకు అదనపు సవాళ్లు

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో రాజకీయ విభేదాలు ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు కొన్నిచోట్ల వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ తరఫున ఎన్నికైన సర్పంచ్‌లు నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల మంజూరు, అధికార యంత్రాంగంతో సమన్వయం వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులున్న గ్రామాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతిపక్ష సర్పంచ్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామాలకు నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలను నిర్ధారించాలంటే గ్రామాలవారీగా నిధుల కేటాయింపులు, మంజూరైన పనులు, విడుదలైన బిల్లుల వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్‌లను ఆశ్రయిస్తుంటే, నిధులు అందుబాటులో లేకపోవడం వారి ముందున్న ప్రధాన సవాలుగా మారుతోంది. అభివృద్ధి పనులు నిలిచిపోతే ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి అవసరాల ప్రాతిపదికన నిధులు అందితేనే సమాన అభివృద్ధి సాధ్యమవుతుంది.

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా

గ్రామీణ రాజకీయాల్లో ప్రజాప్రతినిధులపై సామాజిక అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజలు కోరుకుంటారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా ముందుగా సర్పంచ్ లేదా స్థానిక నాయకుడి వద్దకు వెళ్లడం సాధారణం. అయితే, ప్రజల అవసరాలకు స్పందించాలనే బాధ్యతకు తగిన ఆర్థిక వనరులు లేకపోతే ఇబ్బందులు తప్పవు. అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లకు ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని కొందరు భావిస్తుండగా, ప్రతిపక్ష సర్పంచ్‌లు తమ గ్రామాలకు నిధులు సాధించేందుకు అదనపు ప్రయత్నాలు చేయాల్సి వస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ప్రతి గ్రామంలో పరిస్థితి ఒకేలా ఉండదు. రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా స్థానిక సంస్థలకు నిధులు, అధికారిక సహకారం సమానంగా అందడం కీలకం.

మంత్రి పొంగులేటి ఆశీస్సులతో రాయిగూడెంలో అభివృద్ధి పరుగులు

బోయిన వేణు, సర్పంచ్.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గ ఆదేశాలు, సూచనల మేరకు మా రాయిగూడెం గ్రామంలో రూ. కోటి ఇరవై లక్షల రూపాయలు వైగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశాం. మంత్రి సహకారంతోనే ఈ పని సాధ్యమైంది. గ్రామ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. మంత్రి గ్రామాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారు. అధికారులు త్వరగా బిల్లు చెల్లిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం అని తెలిపారు.

నిధుల కోసం ఎదురుచూపులు... అభివృద్ధికి ఆటంకం

మేము గెలిచాక ప్రజల సమస్యలు తీర్చాలని చూస్తున్నాం. కానీ నిధులు ఆలస్యం అవుతున్నాయి. సొంత డబ్బులు పెట్టి పనులు చేశాం. ప్రభుత్వం అన్ని గ్రామాలకు సమానంగా నిధులు ఇస్తే, పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరుగుతుంది.
కమదన ప్రవీణ్ తిరుమలపురం సర్పంచ్ నేలకొండపల్లి మండలం

28 నుండి సత్తుపల్లిలో క్రీడా సంబరం

-మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
-73వ రాష్ట్రస్థాయి మహిళల ప్రో కబడ్డీ పోటీలు
-మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా నిర్వహణ
-ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతుల మీదుగా ప్రారంభోత్సవం






ప్రజాపక్షం/సత్తుపల్లిః మహిళా క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, క్రీడారంగంలో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుండి 30 వరకు సత్తుపల్లిలో 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ప్రో కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు వెల్లడించారు. సోమవారం పట్టణంలోని రాణీ సెలబ్రేషన్స్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో మువ్వా యూత్ పర్యవేక్షణలో అక్టోబర్ 28, 29, 30 మూడు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరగనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి సుమారు 555 మంది క్రీడాకారులు, 200 మంది వరకు అధికులు, పిఈటీలు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సత్తుపల్లిలోని రాణి సెలబ్రేషన్స్‌లో జరగనున్న ఈ క్రీడా సంబరాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిదయానంద్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కబడ్డీ మన దేశ సాంప్రదాయ క్రీడల్లో ఒకటని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ క్రీడకు విశేష ఆదరణ ఉందని మువ్వా విజయబాబు అన్నారు. కబడ్డీ వంటి క్రీడలు మహిళల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణతో పాటు జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న ప్రస్తుత తరుణంలో క్రీడారంగంలోనూ వారిని ప్రోత్సహించడం సమాజ బాధ్యతగా భావించాలన్నారు.

సత్తుపల్లి క్రీడా ఖ్యాతికి మరో మైలురాయి...

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి క్రీడా కార్యక్రమం మహిళా క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు సత్తుపల్లి ప్రాంతానికి క్రీడారంగంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు రోజులపాటు జరిగే పోటీలను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సత్తుపల్లి ప్రాంతంలో ఈ ప్రో కబడ్డీ పోటీ నిర్వహించేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర అసోసియేషన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ నైపుణ్యం చూపించిన ఆటగాళ్లను హిమాచల్ ప్రదేశ్ లోని జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక జరుగుతుందన్నారు. మొత్తం 34 టీంలు 60 మంది రెఫరీలు ఇక్కడకు రానున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని పల్లె టీమ్ లకు శిక్షణ జరుగుతుందని వారికి కావలసిన కిట్ లను సైతం అందిస్తున్నట్లు మువ్వా విజయబాబు తెలిపారు. వెయ్యి మందికి ఉదయం బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డి ఎం అండ్ హెచ్ ఓ ఆధ్వర్యంలో అంబులెన్స్, మెడికల్ సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. క్రీడాభిమానులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలని మువ్వా విజయబాబు పిలుపునిచ్చారు. క్రీడల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించి ఈ క్రీడా వేడుకను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కటికాల క్రిస్టఫర్ బాబు (రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా కార్యదర్శి), కె. స్వాతిముత్యం (రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి), చి. సుధాకర్ (ఖమ్మం జిల్లా సంయుక్త కార్యదర్శి), సత్తుపల్లి పట్టణం 1వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్, 6వ వార్డు కౌన్సిలర్ సుజల రాణి, అన్నపరెడ్డిపల్లి శివాలయ చైర్మన్ మల్లెల నరసింహారావు, బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు), భీమవరం సర్పంచ్ వంట్ల రమేష్, కాకర్లపల్లి సర్పంచ్ పొదిలి మారేశ్వరరావుతో పాటు పట్టణ కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మంత్రి పొంగులేటి, మువ్వా విజయబాబు అభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గిరిజన బిడ్డ అరుదైన విజయం

క్రికెట్ పిచ్‌పై దేవి ప్రియ సరికొత్త చరిత్ర



ప్రజాపక్షం/కరకగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామానికి చెందిన రామటెంకి దేవి ప్రియ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికై అరుదైన ఘనత సాధించింది. ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చి తన ప్రతిభను చాటుకున్న ఈ యువ క్రీడాకారిణి మేడ్చల్ క్రికెట్ ఏరినా (ఎంసిఏ) బెస్ట్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందింది. కోచ్‌లు ఇర్ఫాన్, బుచ్చిబాబు, వెంకట్‌ల మార్గదర్శకత్వంలో నిరంతరం కఠోర సాధన చేస్తూ క్రికెట్‌లో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్న ఆమె, ఈ జిల్లా జట్టుకు ఎంపిక కావడం ద్వారా తాటిగూడెం గ్రామానికి మరియు కరకగూడెం మండలానికి గర్వకారణంగా నిలిచింది. తల్లిదండ్రులు రామటెంకి హనుమంతరావు, ఉమామహేశ్వరి అందించిన ప్రోత్సాహం మరియు అకాడమీ నిర్వాహకుల సహకారంతో ఆమె ఈ స్థాయికి చేరుకోగా, రాబోయే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని స్థానికులు, అధికారులు మరియు క్రీడాభిమానులు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఒక మూల నుంచి ప్రారంభమైన ఈ ప్రయాణం.. రేపు మరెంతో మంది యువతులకు పెద్ద పెద్ద కలలు కనే ధైర్యాన్ని ఇస్తుంది. కష్టపడితే ఏ రంగంలోనైనా తిరుగులేదని నిరూపించిన దేవి ప్రియ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తూ మరెన్నో విజయాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కోచ్‌లు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షిస్తున్నారు.

అండర్-17 ఎస్‌జిఎఫ్ క్రికెట్ జట్టుకు ఎలైట్ క్రికెట్ అకాడమీ విద్యార్థి ఎంపిక



ప్రజాపక్షం/మణుగూరుః ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్17 బాలుర ఎస్‌జిఎఫ్ క్రికెట్ జట్టుకు మణుగూరులోని ఎలైట్ క్రికెట్ అకాడమీ విద్యార్థి టిజిటి కౌశిక్ ఎంపికయ్యాడు. అక్టోబర్ 23, 2026న కొత్తగూడెంలోని స్థానిక ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్17 బాలుర క్రికెట్ ఎంపికల్లో కౌశిక్ తన ప్రతిభను కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావడం విశేషం. మణుగూరు ప్రాంతానికి చెందిన యువ క్రికెటర్ కౌశిక్ ఈ ఘనత సాధించడం పట్ల ఎలైట్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. అకాడమీలో పొందిన శిక్షణ, నిరంతర సాధన, క్రమశిక్షణ అతని విజయానికి దోహదపడ్డాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయిలో క్రికెట్ ఆడాలని ఆకాంక్షించారు.

ప్రజావాణికి అసలు అధికారులు దూరం..!

-హాజరవుతున్నది కిందిస్థాయి సిబ్బందే!
-అధికారుల తీరుపై విమర్శలు..జిల్లా కలెక్టర్ ఆదేశాల బేఖాతర్!



ప్రజాపక్షం/వైరాः ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి కొందరు శాఖల బాధ్యతాయుత అధికారులు గైర్హాజరవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైరా మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి సుమారు 26 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా, 25 శాఖల ప్రతినిధులు హాజరైనట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వారిలో కొందరు అటెండర్లు, కింది స్థాయి ఉద్యోగులే ఉండటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలనే ఉద్దేశ్యంతో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే సమస్యలకు భాధ్యత వహించాల్సిన అధికారులు హాజరుకాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపిస్తుండటంతో ప్రజలకు ఆశించిన స్థాయిలో పరిష్కారం లభిస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతి వారం ఇదే పరిస్థితి కొనసాగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. వైరా మండల పరిషత్ అధికారి ఉపేంద్రయ్య, తహశీల్దార్ సురేష్, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు తదితరులు క్రమం తప్పకుండా ప్రజావాణికి హాజరవుతున్నట్లు తెలుస్తుంది. అయితే కొన్ని శాఖలకు చెందిన బాధ్యతాయుత అధికారులు మాత్రం స్వయంగా హాజరు కాకంపడా కిందిస్థాయి ఉద్యోగులను పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాల్సి ఉండగా, కొందరు అధికారులు గైర్హాజరవుతున్నారనే ఆరోపణలు జిల్లా కలెక్టర్ ఆదేశాల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు హాజరుకాకపోవడానికి గల కారణాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజావాణి కేవలం హాజరు పట్టీ నింపే కార్యక్రమం కాకుండా ప్రజల సమస్యలను పరిష్కారం చూపే వేదికగా మారాలని స్థానికులు కోరుతున్నారు. వైరా మండలంలో ప్రజావాణికి గైర్హాజరవుతున్న అధికారులపై జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఇకనైనా అన్ని శాఖల బాధ్యతాయుత అధికారులు స్వయంగా హాజరవుతారా? అన్నది వేచిచూడాలి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి



ప్రజాపక్షం/మధిరः మధిర మండల, పట్టణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మధిర మండల కాంగ్రెస్ పార్టీ ధ్వక్షుడు పారుపల్లి విజయకుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, శాసనమండలి మాజీ సభ్యులు, మధిర నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జ్ పోట్ల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి చేపట్టాల్సిన కార్యచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రతి డివిజన్ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లు తమకు కేటాయించిన బూత్‌లలో ఉన్న పట్టభద్రులను గుర్తించి అర్హులైన పట్టభద్రుల వివరాలను సేకరించి, వారి నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా బిఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకొని వారి హక్కుల పరిరక్షణకు కృషి చేసే కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల ప్రచారం వరకు ప్రతి దశలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ పట్టభద్రుల మద్దతును కూడగట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాధం, జిల్లా సెక్రటరీలు మిర్యాల వెంకటరమణ గుప్తా, పులిబండ్ల చిట్టిబాబు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమటి నవీన్‌రెడ్డి, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పట్టణ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కండక్టర్‌పై దాడికి నిరసనగా మధిర డిపో జేఏసి ఆందోళన



ప్రజాపక్షం/మధిరः మణుగూరు డిపోలో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్ ప్రవళికతో చిల్లర విషయంలో గొడవపడిన ఓ మహిళా ప్రయాణికురాలు, కండక్టర్‌ను బస్సు డోర్ నుంచి బయటకు నెట్టివేసి దాడిని మధిర డిపో జేఏసి ఆధ్వర్యంలో ఆర్‌టిసి కార్మికులు డిపో గేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. విధులకు హాజరైన కార్మికులందరూ మొదటి బస్సు నుంచే నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి కార్మికులపై దాడులను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నిరంతరం రవాణా సేవలు అందిస్తున్న కార్మికులపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు విధి నిర్వహణలో పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, ఆర్‌టిసి యాజమాన్యానికి ఉందని అన్నారు. మహిళా కండక్టర్ ప్రవళికపై దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు తిమ్మినేని రామారావు, షేక్ నాగులమీరా, కోటయ్య, కిరణ్‌బాబు, జి.ఎలియాస్, ఎస్ఎస్.రావు, సత్యనారాయణ, హరికృష్ణ, శేషయ్య, షేక్ రహీం, షేక్ ఖాసిం సాహెబ్, కోటేశ్వరరావు, గౌస్, శ్రీనివాసరావు, తిరుపతిరావు, కొండలరావు, రజిత, అనూష, సుజాత, లక్ష్మీ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

10 కోయ ఆదివాసీ గ్రామాల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని 10 కోయ ఆదివాసీ గ్రామాల ప్రజలు కుల ధ్రువీకరణ పత్రాలు, పోడు భూములకు అటవీ హక్కు పట్టాలు మంజూరు చేయడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ భద్రాచలం ఐటీడీఏ ప్రజాదర్బార్‌లో వినతిపత్రం సమర్పించారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేక విద్యార్థులు, నిరుద్యోగ యువత విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులకు నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో రహదారులు, త్రాగునీరు, విద్యుత్, వీధి దీపాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. మణుబోతులపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్ పోడియం పవన్ ఆధ్వర్యంలో వినితిపత్రం సమర్పించగా, గ్రామాల ప్రజలు ధర్మయ్య, గణపతి, ఇడమయ్య, రాజు, భీమయ్య, ఇర్మయ్య, లక్ష్మయ్య, చుక్కయ్య, రాము, కృష్ణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ సీటు సాధించిన కనకపూడి మహేష్



ప్రజాపక్షం/మధిరः పేదింటి నుంచి వచ్చి పట్టుదలతో చదివి ఎంబిబిఎస్ సీటు సాధించిన మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన కనకపూడి మహేష్ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. కనకపూడి చిన్న నర్సింహారావు, సునీత దంపతుల కుమారుడైన మహే ష్ నీట్ పరీక్షలో 412 మార్కులు సాధించి భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు పొందారు. ఈ సందర్భంగా మధిర ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి అరుణ్, ఉప కోశాధికారి శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు అర్జున్, సహాయ కార్యదర్శిలు గౌతమ్, క్రిష్ణఫర్ ఘనంగా సన్మానించారు. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా పట్టుదల, కృషితో లక్ష్యాన్ని చేరుకోవచ్చని మహేష్ విజయం నిరూపిస్తుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి వైద్య విద్యలో ప్రవేశం పొందడం పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహేష్‌ను పలువురు అభినందిస్తూ,భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి పేద ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తున్నారు. మహేష్ సాధించిన విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

ఫణితి సూరమ్మకు బిఆర్ఎస్ నాయకుల నివాళి



ప్రజాపక్షం/వైరాः వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డుకు చెందిన ఫణితి సూరమ్మ(65) మృతి చెందారు. ఆమె మరణవార్త తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున రావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి తదితరులు సూరమ్మ భౌతికఖాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో ఫణితి శాంతయ్య, ఫణితి శ్రీనివాసరావు, ఫణితి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన



ప్రజాపక్షం/వైరాः పట్టభద్రుల ఎమ్మెల్సీ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా మాజీ ఎంఎల్‌సి డాక్టర్ బాసోతు చంద్రావతి క్షేత్రస్థాయిలో చొరవ తీసుకున్నారు. వైరా మండలంలోని కెజి సిరిపురం, విప్పలమడక గ్రామాల్లో కొనసాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాల్లో ఆమె పాల్గొని నమోదు ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. అనంతరం విప్పలమడక గ్రామంలో నిర్వహిస్తున్న నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన నమోదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా నమోదు కావాల్సిన పట్టభద్రుల వివరాలు, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై స్థానిక నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న నమోదులను వేగవంతం చేసి సాంకేతికంగా, ఇతరత్రా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించుకుంటూ గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ వార్డు సభ్యులు ముత్తమాల వెంకటరత్నం, ముత్తమాల దేవానందం, తాళ్లూరి వెంకట్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు మేడా రాంబాబు, అక్కిశెట్టి వెంకటేశ్వర్లు, పారుపల్లి శ్రీకాంత్, వీరపనేని చంద్రశేఖర్, వక్కంతుల నాగేశ్వరరావు, ఇరిగినేని శ్రీనివాసరావు, ముత్తమాల రమేష్, వాసిరెడ్డి రవి, తడికమళ్ల నాగేశ్వరరావు, చీటి నాగేంద్రబాబు, దుమ్మలపాటి బసవయ్య, నారపోగు మైసయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని సీనియర్ సిగ్నల్ టెక్నీషియన్ మృతి



ప్రజాపక్షం/మధిరः తేరాత్రి సుమారు 20.25 గంటీలకు మధిర రైల్వేస్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మద్దకూరి శివరామబ్రహ్మం(44) తండ్రి రంగయ్య దొర, కులం కాపు, వృత్తి సీనియర్ సిగ్నల్ టెక్నీషియన్, రైల్వేశాఖ, మధిర అను వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన 25వ తారీఖు ఆదివారం రాత్రి సుమారు 8గంటలకు జరిగింది. సదరు వ్యక్తి గత 44 రోజులుగా మధిర రైల్వేస్టేషన్ పరిధిలో సిగ్నల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం విధి నిర్వహణ నిమిత్తం మధిర రైల్వేస్టేషన్ నుండి డౌన్ రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళుతుండగా, అదే సమయంలో డౌన్ రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళుతుండగా, అదే సమయంలో గంటకు సుమారు 95 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న రైలు నెంబర్ 20806 ఏపి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై మధిర స్టేషన్ మాస్టర్ ఖమ్మం స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించగా, వారి ద్వారా అందిన సమాచారం మేరకు ఖమ్మం జిర్పా పోలీస్‌స్టేషన్ ఎస్సై సిహెచ్.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. వారి ఆదేశాల మేరకు ఏ.సత్యనారాయణరెడ్డి, ప్రమాద స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం తదుపరి అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని బంధువులకు అప్పగించనైనది.

బైక్‌స్టాంట్లు చేస్తున్న మైనర్‌పై కేసు నమోదు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రమణగుట్ట ప్రాంతానికి చెందిన పదిహేనేళ్ల మైనర్ బాలుడు ద్విచక్రవాహనంపై ప్రమాదకరమైన ఫీట్లు చేస్తుండగా గుర్తించిన టాస్క్‌ఫోర్స్ ఏసిపి సత్యనారాయణ సోమవారం అతడిని అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సిఐ రామకృష్ణ తెలిపారు. ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని అతనిపై కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

-సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్
-విద్యార్థులు చదవడంతో పాటు పాఠ్యాంశాలను అర్థం చేసుకునేలా బోధన సాగాలి



ప్రజాపక్షం/సుజాతనగర్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సుజాతనగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు శాతం, తరగతి గదుల నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిం చారు. విద్యార్థుల హాజరు శాతంపై ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పండుగ సెలవుల అనంతరం పాఠశాలకు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులం దరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 8వ తరగతి ఏ, బి సెక్షన్ల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్య సన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యపుస్త కాల్లోని పాఠ్యాంశాలను చదవాలని కోరడంతో పాటు, చదివిన అంశా లను తెలుగులో వివరించాలని అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు ఆంగ్ల పాఠ్యాంశాలను చదవడంలో, వాటి అర్థాన్ని వివరిం చడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆంగ్ల ఉపాధ్యాయుడిని ఆదేశించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడం మాత్రమే కాకుండా, వాటిలోని విషయాలను అర్థం చేసుకుని తమ మాటల్లో వివరించే సామర్థ్యాన్ని పెంపొందించాల న్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మూర్తితో మాట్లాడుతూ తరగతి గదుల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేం దుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఆదేశించారు. అవ సరమైన పాఠ్యాంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యా ర్థుల్లో చదవడం, అర్థం చేసుకోవడం, విషయాలను విశ్లేషించి వివరిం చడం వంటి నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. విద్యా ర్థులు మరింత ఆసక్తితో చదువుకునేలా ప్రోత్సహిస్తూ, మెరుగైన విద్యా ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయా లని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలోని భవన సముదాయం, సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ పరి శీలించారు. సైన్స్ ల్యాబ్‌కు ప్రవేశ మార్గం, మెట్ల నిర్మాణానికి సంబం ధించిన ప్రతిపాదనలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యా ర్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారు లకు సూచించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో మహారాణుల్లా వెలగాలి



ప్రజాపక్షం/భద్రాచలం : చదువుల్లో ఆడపిల్లలు మహా రాణుల్లా వెలగాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ అన్నారు. భద్రాచలం మహాత్మజ్యోతిబా పూలే తెలంగాణ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూ.కాలేజీలో ఇంటర్ మొదటి సం.చదు వుతున్న బాలికలు ప్రవల్లిక, రేవతి,నందిని లు చదుల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చడంతో ఆయన ప్రంశంసా పత్రాలను తమ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల్లో చక్కరా రాణించి జీవితాల్లో మంచిగా స్థిరపడాలన్నారు. తోటి విద్యార్థులకు ఈ ప్రంశంస స్ఫూర్తిదాయకం కావాలని అన్నారు. విద్యార్థుల చదువుల విష యంలో రాజీ పడకుండా అన్ని విధాలా సహాయపడాలని ప్రిన్సిపల్‌కు ఆయన సూచించారు. ఐటిసి భాగస్వామ్యంతో కళాశాల్లో నీటి జేఇఇ మెయిన్స్ కోసం ఒక కంప్యూటర్ ల్యాబ్, ఒక మినీ లైబ్రెరీని గతంలో ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణలత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మినారాయణ కుటుంబానికి మంత్రి భరోసా



ప్రజాపక్షం/పాల్వంచ : ఆత్మహత్యకు పాల్పడిన పాల్వంచ హెచ్‌పి గ్యాసు కార్యాలయ మేనేజర్ అనంతుల లక్ష్మినారాయణ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణశాఖ మాంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా పర్యటనలో బాగంగా కొత్తగూడెంకు వచ్చిన మంత్రిని జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం నాయ కులు, మృతుడి కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి కలిసి జరిగిన సంఘటనను వివరించారు. బాదిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన మంత్రి పొంగులేటి ఎస్‌పి రోహిత్‌రాజుకు ఫోన్ చేసి ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేసి నిందితులను గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. లక్ష్మినారాయణ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల రద్దు పరిశీలిస్తామని తెలిపారు.బాదిత కుటుంబా నికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎర్రగుంట సాంబశివరావు, గుండు రవికుమార్, ఇమంది ఉదయ్‌కుమార్, పిండిపోలు కన్నయ్య, బొమ్మ రామకిషోర్, వేముల సతీష్, నవీన్, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యంగా కార్పొరేషన్లో స్పెషల్ డ్రైవ్

- కాల్వల పూడికతీత ముమ్మరం
- కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు సమగ్ర కార్యాచరణతో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ప్రారంభించినట్లు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. కొత్తగూడెం,పాల్వంచ, సుజాతనగర్ పరిధిలోని అన్ని డివిజన్లలో సోమవారం క్షేత్రస్థాయిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించారు. ఆనం తరం మేయర్ మాట్లాడుతూ నగర ప్రజారోగ్యాన్ని కాపాడటంలో శాని టేషన్ విభాగం పనితీరు అత్యంత కలీకమని బస్తీలు వీధుల్లో నిల్వ ఉన్న చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రధాన రహదా ర్లతో పాటు అంతర్గత వీధుల్లో పేరుకుపోయిన ముళ్లపొదలను సమూ లంగా తొలగించి రోడ్లను శుభ్రపరచాలన్నారు. ముగురు నీరు నిల్వలు ఉండకుండా నిరంతరం కాల్వల్లో పూజికతీత పనులు వేగవంతం చేయా లని ఆదేశించారు. కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టరాదని, ఈవిషయంలో రాజీపడేదిలేదన్నారు. వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపది కన చేపట్టాలన్నారు. ఈ డ్రైవ్‌లో శాశ్వత సిబ్బందితో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వ హించాలని స్పష్టం చేశారు. ప్రతీ డివిజన్ పరిధిలో ప్రజల నుండి వచ్చే పారిశుధ్య సమస్యల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా శానిటేషన్ ఇన్స్పెక్టర్లు నిత్యం పర్యవేక్షణ చేపడుతూ లక్ష్యాలను చేరుకో వాలని ఆయన సూచించారు.

ఘనంగా శబరిస్మృతి యాత్ర

- ఆలయంలో ప్రత్యేక పూజలు
- గిరి ప్రదిక్షణ



ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయంలో సోమవారం శబరి స్మృతియాత్ర వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున గిరిజనులతో పాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పూల పండ్ల అటవీ ఫల సముదాయా లతో నైవేద్యం సమర్పించి నీరాజనాలు సమర్పించారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున గిరిజనులు కొమ్ము నృత్యాలు ప్రదర్శించారు. ఈ సంద ర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టి పడింది. ఇందులో భాగంగా పట్టణంలో గిరి ప్రదిక్షణ వైభవంగా జరిగింది. పట్ట ణంలో ఉన్న శబరి విగ్రహానికి అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ శ్రీరామునికి ఎంగిలి పండ్లు తినిపించిన అత్యంత గొప్ప భక్తురాలు శబరి అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని శబరిని స్మరించుకుంటూ స్మృతియాత్ర నిర్వహించడం ఆధ్యాత్మిక చింతనకు ఆనవాలుగా నిలుస్తుందని చెప్పారు. సాంప్రదాయాను సారం ఈ వేడుక రాబోయే రోజుల్లో మరింత వైభవంగా జరగాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, ముర్ల రమేష్, ఆలయ ఇఓ దామోదర్‌రావుతో పాటు పలువురు గిరి జన గిరిజనేతర భక్తులు పాల్గొన్నారు.

సత్వరమే వినతులు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్
మ్రినాళ్ శ్రేష్ఠ



ప్రజాపక్షం/భద్రాచలం :
ప్రజావాణిలో వచ్చిన వినతులను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ అన్నారు. స్థానిక సబ్ కలె క్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణికి హాజరైన ఆయన పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారివారి సమస్యలపై నేరుగా వినతులు అందిస్తే పరిష్కారమవుతాయని, అందిన ప్రతీ విన్న పాన్ని ఆన్‌లైన్ చేయాలని సంబంధిత శాఖాధికారులు వ్యక్తిగత పర్యవే క్షణ చేయాలన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ పథకాలు ప్రాధా న్యతా క్రమంలో అందుతాయని ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు అన్నారు.సోమ వారం నిర్వహించిన ప్రజావాణిలో పలు ప్రాంతాల నుండివచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండివచ్చిన గిరి జనుల అందించిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి వీలుగానివైటిపై నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

-పత్తి చేలోకి దూసుకెళ్లిన వైనం -ఇద్దరికి స్వల్ప గాయాలు



ప్రజాపక్షం/కూసుమంచి: ఖమ్మం, సూర్యాపేట జాతీయ రహదారి 365బీబీపై ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పత్తి చేలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన కూసు మంచి మండలం లింగారంతండా సమీపంలో సోమ వారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పత్తి చేలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సులో ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు అదుపు తప్పడా నికి అతివేగం కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. జాతీయ రహదారులపై వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని ఈ ఘటన సూచిస్తోంది.

కోటమైసమ్మ హుండీ ఆదాయం రూ 32.02లక్షలు



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికా యలపల్లి శ్రీకోటమైసమ్మ తల్లి జాతరలో హుండీ ఆదాయం పెరిగింది. ఈ ఏడాది భక్తులు సమర్పిం చిన కానుకల ద్వారా ఆలయానికి నూ 32,02,697 ఆదాయం సమకూరింది. గతేడాది రూ 29,10,386 ఆదాయం రాగా, ఈసారి రూ 2,92,311 అధికంగా లభించింది. విజయదశమి రోజున ప్రారం భమైన జాతర ఐదు రోజులపాటు రాత్రింబవళ్లు కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొత్తలంక కైలాసశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సోమవారం ఆలయ ప్రాంగ ణంలో ఫౌండర్ ట్రస్టు ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, పోలీసుల పర్యవేక్షణలో దేవాదాయ శాఖ సిబ్బంది హుండీ లెక్కింపు చేపట్టారు. పూర్తి స్థాయిలో లెక్కింపు నిర్వహించినట్లు పర్సా పట్టాభి రామారావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆర్ సమత, ఆలయ ఈవో కె వెంక టయ్య, ఫౌండర్ ట్రస్టు ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, సిబ్బంది పర్సా సాయి, పగడాల మోహన్ కృష్ణ, అర్చకుడు కొత్తలంక కైలాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

మల్లవరంలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



ప్రజాపక్షం/ తల్లాడ : మల్లవరం గ్రామంలో సోమవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఎంపిడివో శ్రీధర్ రాజు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కటికి కిరణ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిసిపివో యూనిట్ కౌన్సిలర్ నిరోషా హాజరై కమిటీ ముఖ్య ఉద్దేశాలను, విధి విధానాలను వివరించారు. గ్రామంలో బాలల హక్కులకు భంగం కలగకుండా చూడటం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం, పిల్లలందరూ నిర్బంధంగా పాఠశాలలకు వెళ్లేలా చూడటం ఈ కమిటీ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సిద్దిక్, ఉప సర్పంచ్ యశోద, ఏఐడి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి రామదాసు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చరిత్రకు కొత్త వెలుగులు.. బౌద్ధ వారసత్వ సంపద పరిరక్షణకు చర్యలు

ప్రజాపక్షం/నేలకొండపల్లి: పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు, నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పునర్వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లి రైతు వేదికలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం బౌద్ధ స్తూపం అభివృద్ధి పనులతో పాటు అనాసాగరం నుంచి పమ్మి వరకు రూ.2.80 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. నేలకొండపల్లి మండలంలో మొదటి విడతలో 648 ఇళ్లు మంజూరు కాగా, సుమారు 620 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులను పది రోజుల్లో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు.ఎల్నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు రెండో పంట సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మంత్రి సూచించారు. నీటి లభ్యత, విద్యుత్ సరఫరా సమస్యలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. నేలకొండపల్లి బౌద్ధ స్తూపం మూడో



శతాబ్దానికి చెందిన చారిత్రక వారసత్వ సంపదగా గుర్తింపు పొందిందని మంత్రి పేర్కొన్నారు. గతంలో తవ్వకాల్లో లభించిన పురాతన వస్తువులు హైదరాబాద్ మ్యూజియంలో ఉన్నాయని తెలిపారు. బౌద్ధ మత పెద్దలు, భక్తులు, స్థానికులు, చరిత్ర నిపుణుల అభిప్రాయాలు తీసుకుని స్తూపాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, వారసత్వ సంపద పరిరక్షణకు నిధుల విషయంలో వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్న పూసల సీతారాములు, ఎంపీడీవో ఎర్రయ్య, తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, హెరిటేజ్, పర్యాటక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి మీడియా సహకరించాలి

-వాస్తవాలను నిర్ధారించుకుని వార్తలు ప్రచురించాలి
- జిజిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం నరేందర్



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం నరేందర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో నిర్వహించిన పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం నరేందర్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలు, వైద్య సదుపాయాలు, ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా రూపాంతరం చెందిన అనంతరం చేపట్టిన అభివృద్ధి పనులు, పూర్తయిన కార్యక్రమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల గురించి తెలిపారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అయితే అవసరమైన సదుపాయాల కొరత, సిబ్బంది సమస్యలు, ఆర్థిక పరిమితులు కారణంగా కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఆసుపత్రిలో అభివృద్ధి పనులు చేపడతున్నట్లు వెల్లడించారు. వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పిఆర్వోగా నియమితులైన సుధాకర్‌ను మీడియా ప్రతినిధులకు పరిచయం చేశారు. ఆసుపత్రి యాజమాన్యానికి, పాత్రికేయులకు మధ్య సమన్వయకర్తగా ఆయన వ్యవహరిస్తారని, ఆసుపత్రికి సంబంధించిన వైద్య సేవలు, సదుపాయాలు, అభివృద్ధి పనుల వివరాల కోసం ఆయనను సంప్రదించాలని సూచించారు. ఆసుపత్రికి సంబంధించిన వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని యాజమాన్యం కోరింది. సమస్యలకు గల కారణాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, సంబంధిత అధికారుల వివరణను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారానికి నిర్మాణాత్మక సహకారం అందిచాలని, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేందుకు మీడియా కృషి చేయాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సర్పంచ్ కృషి అభినందనీయం

-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/బూర్గంపాడు: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర సమగ్ర ప్రగతి సాధ్యమవుతుందని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో రూ 10లక్షల తో నిర్మించిన గ్రామ సంస్థ సహాయకురాలి(వీవోఏ) భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు. వీవోఏ భవనం మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు లావాదేవీలు, రికార్డుల నిర్వహణకు ఉపయోగపడుతుందని ఎంఎల్ఏ తెలిపారు. మహిళలకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. గ్రామాల అవసరాలను గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచా



యితీ పాలకవర్గ సభ్యులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పినపాక నియోజక వర్గం లో తొలి వీవోఏ భవనంగా పేర్కొంటున్న ఈ నిర్మాణం గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్, పంచాయితీ రాజ్ శాఖ డీఈ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, ముసలిమడుగు సర్పంచ్ పూణెం సురేందర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉదయ్ కిరణ్, లక్ష్మీపురం ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం





ప్రజాపక్షం/దుమ్ముగూడెం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు దుమ్ముగూడెం పోలీసులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా 150 మందికి హెల్మెట్లు పంపిణీ చేసి, ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు, దేశ రక్షణకు వారు చేసిన సేవలను వివరించారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, యువతపై వాటి ప్రభావం గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులను తెరవవద్దని, వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఇళ్ల, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ నుంచి దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత, సామాజిక బాధ్యతపై చైతన్యం కల్పించడమే కార్యక్రమ ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్, భద్రాచలం సీఐ సట్ల రాజు, చర్ల సీఐ రాజు వర్మ, దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య, ఎస్ఐలు జగన్మోహన్‌చారి, శ్యాం ప్రసాద్, పోలీసు, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలోత్సవ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నగరంలో నవంబర్ 11, 12 తేదీలలో జరిగే బాలోత్సవ్ 2026 పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఖమ్మం డ్యాన్సర్స్ అసోసియేషన్, వారధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలోత్సవ్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బాలోత్సవ్ నిర్వహణ ద్వారా పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఈ బాలోత్సవ్‌లో పాల్గొనాలని ఈ బాలోత్సవ్ విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్ప కృష్ణచైతన్య, ఖమ్మం డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల నాగరాజు, బాధ్యులు సిహెచ్ వెంకటేష్, పగిళ్లపల్లి రాజు, ప్రసాద్, రాజేష్, భవాని పాల్గొన్నారు.

కండక్టర్‌పై దాడికి ఆర్టిసి కార్మికుల నిరసన

ప్రజాపక్షం/ఖమ్మం : మణుగూరు డిపో ఆర్టిసి మహిళా కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడికి నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆర్టిసి యూనియన్లు నిరసన తెలియజేశాయి. బస్సులో నుంచి మహిళా ప్రయాణికురాలు కండక్టర్‌ను నెట్టివేసిన ఘటనకు అధికారులు తక్షణమే స్పందించాలని, సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, అధ్యక్షులు భూదాటి శ్రీనివాసరెడ్డి, నాయకులు గుర్రం రామారావు, అనిత, బేతంపూడి బుచ్చిబాబు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్, డిపో కార్యదర్శి రోశయ్య, నాయకులు వినోదరావు, టిడబ్ల్యూ కార్యదర్శి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన వేమూరి హరిబాబు



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామ పంచాయితీ జన్నెలగూడెం గ్రామానికి చెందిన వేమూరి హరిబాబు సీపీఐలో చేరారు. మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీటీసీ రేసు ఎల్లయ్య, గుండాల మండల కార్యదర్శి, ఆళ్లపల్లి మండల సహాయ కార్యదర్శి వజ్జ పగడయ్య, వాగబోయిన రమేష్, పెద వెంకటాపురం సర్పంచ్ వజ్జ ఉమ, వార్డు సభ్యులు కుంట ఉమారాణి, గౌరవబోయిన సీత, నాయకులు ముక్తార్ పాషా, చిరంజీవి, లాజర్, ఇమ్మానియేట్, సూర్య నారాయణ, వెంకటేష్, గడ్డం శ్రీను, రాజేందర్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిజెపి కిసాన్ మోర్చా ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు బాధిత రైతులతో కలిసి సోమవారం తల్లాడలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అన్నారుగూడెం గ్రామానికి చెందిన రైతు బీరెల్లి సామేలు రెండేళ్ల క్రితం పశువుల షెడ్డు నిర్మించుకున్నప్పటికీ ఇప్పటి వరకు బిల్లు మంజూరు కాలేదన్నారు. గత గ్రామసభలో బిల్లు మంజూరైనట్లు ఆయన పేరును ప్రకటించినప్పటికీ నేటికీ నగదు అందజేయలేదన్నారు. అన్నారుగూడెం గ్రామానికి చెందిన రైతు ముద్రబోయిన నాగమణికి చెందిన ఎకరం వ్యవసాయ భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వాడపల్లి నాగేశ్వరరావు, బాధిత రైతులు బీరెల్లి సామెలు, ముద్రబోయిన నాగమణి, తొండపు ప్రసాదరావు, పులి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజానాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



ప్రజాపక్షం/ తల్లాడ : ప్రజానాట్యమండలి రెండవ మహాసభను తల్లాడలోని దొడ్డ కృష్ణయ్య భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభ సూచకంగా ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు తాళ్లూరి రాములు ప్రజానాట్య మండలి జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలో ప్రజానాట్యమండలి తల్లాడ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గండమల ఆనందరావు, మేడి బిక్షం లు ఎన్నికయ్యారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ మాట్లాడుతూ ప్రజానాట్యమండలి నత్యం ప్రజా సమస్యలను పాటలు, కళారూపాల ద్వారా ప్రజల గొంతుకగా వినిపిస్తూ ప్రజలను చైతన్యపర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షులు కె. నరేంద్ర, సత్తుపల్లి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యం, సనందరావు, ప్రజాతంత్ర బాధ్యులు రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, మోహన్‌రావు, నరేష్, షేక్ మస్తాన్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, లక్ష్మి, రాములు, ఎల్లారావు, రాములు, కృష్ణ, నాగేశ్వరరావు, సంజీవరావు, రాములు, సూర్యప్రకాశరావు, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం ప్రారంభం

ప్రజాపక్షం/మణుగూరు: శాఖా గ్రంధాలయం మణుగూరు నందు ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ అయిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.